
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్

5 జిల్లా వార్తలు

గురువారం 7 ఆగస్టు 2025

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు నిరంతర ప్రక్రియ

● నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్, ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు నిరంతరం కొనసాగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. రేకుర్తి, బొమ్మకల్, సీతారాంపూర్, ఆరెపల్లి, అల్గునూరు, తీగలగుట్టపల్లి, చింతకుంట తదితర విలీన గ్రామాల డివిజన్లలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా రెవెన్యూశాఖ సహాయంతో హద్దులు మార్కింగ్ చేయాలని ఆదేశించారు.

ఆయుష్ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఏడీ

సుభాష్‌నగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆయుష్ ఆసుపత్రిని బుధవారం ఆయుష్ ఏడీ డాక్టర్ పరమేశ్వరనాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యాధికారి డాక్టర్ శేఖర్, ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ సదానందం, ఆయుష్ డీపీఎం ప్రవీణ్‌కుమార్, ఫార్మసిస్టులు రాజేశ్వర్, విజయేందర్, సిబ్బంది మధు, పుష్ప, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఆయుష్ ఏడీ డాక్టర్ పరమేశ్వరనాయక్

ముస్తాబైన మహాశక్తి ఆలయం

● రేపు వరలక్ష్మీ వ్రతాలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చైతన్యపురి మహాశక్తి దేవాలయం వరలక్ష్మీ వ్రతాలకు ముస్తాబైంది. శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రతి యేటా మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయంలో సామూహిక వ్రతాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం అమ్మవార్లకు ఫలరస పంచామృత, మంగళ ద్రవ్యాలతో అభిషేకాలు జరుగనున్నట్లు, శుక్రవారం ఉదయం మహాహారతి, సాయంత్రం సామూహిక వ్రతాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహ కులు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించగా భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు.



ముస్తాబైన మహాశక్తి ఆలయం

వానాకాలం సాగుపై ఆశలు

- నేటి నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల
- హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు
- ఇప్పటికే 1,93,554 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి
- మరో 80 వేల ఎకరాల్లో నాట్లు వేసే అవకాశం
- వర్షాలు లేక ఎండుతున్న పంటలకు అందనున్న నీరు



వానాకాలం పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడానికి షెడ్యూల్ ఖరారైంది. ఎస్సారెస్పీ నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నరైతాంగానికి శివం కమిటీ శుభవార్త చెప్పింది. బుధవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన రాష్ట్ర స్థాయి సమీకృత నీటి ప్రణాళిక యాజమాన్య కమిటీ (ఎస్‌సీఐడబ్ల్యూఏఎం) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆశలు రేకెత్తాయి.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఇటీవల కురిసిన వర్షాలతో వచ్చిన కొద్దిపాటి నీరు మినహా చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండక ఖరీఫ్ సాగుపై రైతులు క్రమేపీ ఆశలు కోల్పోతూ ఆందోళన చెందుతున్న దశలో నీటి పారుదల శాఖ శుభవార్త వినిపించింది. వరిపొలాలు, పత్తి, మొక్కజొన్న పంటలు నీరులేక ఎండల తీవ్రతకు ఎండిపోతుండటంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని వదలాలని తీసుకున్న నిర్ణయం వాటికి ప్రాణం పోయనున్నది. రాష్ట్రస్థాయి సమీకృత నీటి ప్రణాళిక యాజమాన్య కమిటీ సమావేశం ఈ నెల 7 నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద ఉన్న కాకతీయ, లక్ష్మీ కాలువలకు సాగునీరు వదలాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం ఉదయం 11 గంటలకు నీటి విడుదల ప్రారంభం కానున్నది.

● పూర్తికాని వరినాట్లు

జిల్లాలో వానాకాలం 2,76,500 ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకు 1,93,892 ఎకరాల్లో రైతులు నాట్లు వేశారు. మరో 80 వేల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉన్నది. ఇటీవల కురిసిన వర్షపు నీటితో పొలాలన్నింటినీ దున్ని రైతులు నాటుకు సిద్ధం చేశారు. ఈ సీజన్‌లో 48 వేల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేయగా ఇప్పటికే 38,892 ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశారు. అవన్నీ మొలకెత్తాయి. అలాగే 4 వేల ఎకరాల్లో మొక్కజొన్న వేయాల్సి ఉండగా 2,668 ఎకరాల్లో విత్తనాలు వేయడం పూర్తయింది. 3 వేల ఎకరాల్లో పెసర, కంది పంటలు వేస్తారని అంచనా వేయగా 512 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. వరి, మొక్కజొన్న, పత్తి పంటలు వ్యవసాయశాఖ అంచనా వేసిన మేరకు సాగవుతాయని భావిస్తున్నారు.

● ఎస్సారెస్పీలో 40.5 టీఎంసీల నీరు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ సామర్థ్యం 80 టీఎంసీలు కాగా 50 టీఎంసీల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరినప్పుడే సాగు అవసరాల కోసం నీరు విడుదల చేయడం ఆనవాయితీగా వస్తున్నది. గత సంవత్సరం ప్రత్యేక సందర్భంలో 45 టీఎంసీల నీరు ఉన్న దశలోనే పంటలను కాపాడడానికి నీటి విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 40.582 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. అయినా ఆయకట్టు పరిధిలో ఇంకా నాట్లు పూర్తికాకపోవడం రైతులు పోసుకున్న నార్లు ముదిరి ఎండిపోతున్నాయి. నాట్లు వేసిన పొలాలు కూడా అవసరమైన నీరందక ఎండిపోతుండగా పత్తి, మొక్కజొన్న పంటల పరిస్థితి కూడా ఆశలు వదులుకోవాల్సిన దశకు చేరుకున్నది. దీంతో 40 టీఎంసీలు ఉన్నా నీటి విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్న రైతులు స్వాగతిస్తూ హర్షిస్తున్నారు.

● ప్రాజెక్టు కింద జిల్లాలో 1,39,787 ఎకరాల సాగు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద కరీంనగర్ జిల్లాలోని 1,39,787 ఎకరాలు సాగవుతాయి. ఇందులో లక్ష ఎకరాలు ఎల్‌ఎండీ దిగువన ఉండగా 39 వేల ఎకరాలు ఎల్‌ఎండీ ఎగువన ఉన్నాయి. కాకతీయ కాలువ ద్వారా ఈ ఆయకట్టుకు నీరు అందుతుంది. ఈ ఆయకట్టు మొత్తం ప్రస్తుతం సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమై ఇప్పటికే సగం వరకు నాట్లు వేశారు. బోరుబావులు, ఓపెన్ బావులు, చెరువులు, కుంటల కింద మరో లక్షా 30 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండితే ప్రాజెక్టు ద్వారా కాకతీయ, వరద కాలువలకు నీరు విడుదల చేసి మిడ్ మానేరు, ఎల్‌ఎండీ ప్రాజెక్టులను నింపి వాటి ద్వారా ఆయకట్టుకు నీరందిస్తారు. అయితే వర్షాభావ పరిస్థితుల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండని పరిస్థితి నెలకొన్నది.

(మిగతా 8వపేజీలో)





వివరాలు తెలుసుకుంటున్న ఏసీ సుప్రియ

వసతి గృహాల తనిఖీ

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ బుధవారం ఓల్డ్ హైస్కూల్ ప్రాంగణంలోని ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహం, అదే ప్రాంగణంలో ఆనంద నిలయం పేరులో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పంపిణీ చేయాలన్నారు. వార్డెన్‌లు బి రవీందర్, ఎన్ పరమేశ్, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.

జయశంకర్ ఆశయాలను కొనసాగించాలి

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మదీనా కాంప్లెక్స్‌లోని జయశంకర్ విగ్రహానికి, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాలులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీకిరణ్, అశ్విని తానాజీ వాకడే, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జయశంకర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావులు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

యూరియా కోసం రైతుల పాట్లు

● నిలబడ లేక చెప్పులు క్యూలో పెట్టి ఎదురుచూపులు

సైదాపూర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలో యూరియా కోసం రైతులు పాట్లు పడుతున్నారు. రెండు మూడు రోజులకు ఒక లోడ్ వస్తుండడంతో డిమాండ్ పెరిగింది. యూరియా లోడ్ వచ్చిందని సమాచారం రాగానే రైతులు ఉదయం నుంచే గోదాముల వద్ద పడిగాపులు కాస్తున్నారు. బుధవారం మండలంలోని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని ఎక్లాస్‌పూర్ గోదాముకు 450 బస్తాల యూరియా వచ్చింది. రైతులు ఉదయమే వెళ్లి గంటల తరబడి నిలబడే ఓపిక లేక సొసైటీ సిబ్బంది వచ్చే వరకు చెప్పులను క్యూలో పెట్టారు. సొసైటీ సిబ్బంది ఉదయం తొమ్మిది గంటల తరువాత వచ్చి రైతులకు యూరియా పంపిణీ చేశారు. యూరియా కోసం రోజుల తర బడి వేచి చూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వ్యవసాయాధికారి వైదేహిని వివరణ కోరగా యూరియా కొరత లేదని, సరిపడ యూరియా వస్తుందని తెలిపారు. కొందరు రైతులు అవసరానికి మించి నిల్వ వేసుకుంటున్నారని అలా చేయవద్దన్నారు. అవసరం ఉన్నంత వరకే యూరియా తీసుకెళ్తే రైతులందరికీ అందుతుందన్నారు.



ఎక్లాస్‌పూర్‌లో యూరియా కోసం చెప్పులు క్యూలో పెట్టిన రైతులు

నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేస్తే కఠిన చర్యలు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నిషేధిత భూముల జాబితా భూములను రిజిస్ట్రేషన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఆ భూముల జాబితాను నవీకరించాలని, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మునిసిపల్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అనుసరించి మాత్రమే రిజిస్ట్రేషన్లు జరపాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు నిర్ణయించాలని మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇంటి నెంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయాల్సి వస్తే సంబంధిత నిర్దిష్ట డాక్యుమెంట్లతో పాటు మునిసిపల్ లేదా గ్రామపంచాయతీ నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలని ఆదేశించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ప్రభుత్వ స్థలాలు రిజిస్ట్రేషన్ చేయడం వల్ల కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల ముందు నిషేధిత జాబితా సర్వేనెంబర్‌లను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ చేస్తే చర్యలు తప్పవని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, డీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, ఆర్‌డీఓలు మహేశ్వర్, రమేష్, రిజిస్ట్రేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

● తల్లిపాలతో రోగ నిరోధక శక్తి

సుభాష్‌నగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెరిగి శిశువులు ఆరోగ్యంగా ఉంటారని, పుట్టిన శిశువుకు తప్పనిసరిగా గంటలోపు తల్లిపాలు తాగించాలని కలెక్టర్ పమేలాసత్పతి సూచించారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బుదవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా జనరల్ ఆసుపత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ అశ్విని తనాజీ వాఖడే ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా చెల్మెడ వైద్య కళాశాల విద్యార్థులు తల్లిపాల గొప్పతనం గురించి బాలిం తలు, గర్భిణులకు వివరించారు. తల్లిపాల విశిష్టత వివరిస్తూ వేసిన నాటకం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తల్లి బిడ్డకు జన్మనిచ్చిన తరువాత ఆరు నెలలు తల్లిపాలే తాగించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం, బాలామృతం సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కానింగ్, వ్యాక్సీన్లపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ అశ్విని తనాజీ వాఖడే మాట్లాడుతూ శిశువుకు తప్పనిసరిగా ఏడాదిపాటు పాలు ఇవ్వాలని తల్లులకు సూచించారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉండి వైద్యుల సూచనలు పాటించాలన్నారు. అనంతరం బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఆర్‌ఎంవో నవీన, సన, సీడీపీవో సబిత తదితరులు పాల్గొన్నారు.

ఊసే లేని ఆర్టీసీ విలీనం

- కార్మికుల ఎదురు చూపులు
- ఉద్యోగుల్లో అభద్రతా భావం
- యూనియన్లు లేక అటకెక్కిన డిమాండ్లు

7

విద్యార్థుల కోసం ఎన్‌ఎస్‌పీ పోర్టల్

6

పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదు

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదని, హైడ్రా లాగా ఇక్కడ చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హెచ్చరించారు. డ్యాం సేఫ్టీ నిబంధన ప్రకారం ప్రత్యామ్నాయం చూసుకోవాలని అస్తపురం కాలనీ, బతుకమ్మ కాలనీ వాసులకు నీటిపారుదల శాఖ అధికారులు నోటీసులు పంపించారు. బుధవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆయా కాలనీల్లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పర్యటించారు. కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఇళ్లు కూలుస్తామంటే మాత్రం ఊరుకునేది లేదని అన్నారు. పేదల ప్రక్షాన బీఆర్‌ఎస్ పార్టీ కొట్లాడుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు స్పందించి పేదలకు భరోసా ఇవ్వాలని కోరారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్ర రాజు, మాజీ కార్పొరేటర్లు ఏవీ రమణ, దిండిగాల మహేష్, నక్క కృష్ణ, నాంపల్లి శ్రీనివాస్, గుగ్గిళ్లపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మకాలనీ వాసులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

చిగురుమామిడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరిలో బుధవారం గ్రామానికిచెందిన గీరబోయిన అజయ్(21) బైక్ అదుపు తప్పి పడి మృతిచెందినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అజయ్ నవాబుపేటనుంచి స్వగ్రామం సుందరగిరికి బైక్‌వస్తున్నాడు. అదుపుతప్పి రోడ్డుపక్కనున్న విద్యుత్‌స్థంభాన్ని ఢీకొట్టాడు. దీంతో బలమైనగాయాలై సంఘటన స్థలంవద్దే మృతిచెందాడు. మృతుడు అజయ్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్నకొండలో గుర్తు తెలియని మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ శివారులోని వ్యవసాయబావిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమయింది. ఎస్ఐ నరేష్‌రెడ్డి కథనం మేరకు ఆర్నకొండ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 40నుంచి 45సంవత్సరాల వయస్సు ఉండి, ఒంటిపై బిస్కెట్ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఎడమ చేతికి ఓం సింబల్ గల ఆరెంజ్ రంగు దారం ఉందని తెలిపారు. ఆర్నకొండ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్‌రెడ్డి తెలిపారు. వ్యక్తి వివరాలు తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగినేడు గ్రామానికిచెందిన దయాకర్ (29) ఆర్థికఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దయాకర్ పెద్దపల్లి ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం వాహనం కొనుగోలుకు మూడు లక్షల రూపాయలు అప్పు చేశాడు. వాహనం కొనకపోవడం, అప్పులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాడు. ఆర్థికఇబ్బందులు భరించలేక ఇంట్లో ఎవరులేని సమయంలో మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య దేవపాల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసులపల్లి గ్రామానికి చెందిన మహంకాళి (53) చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడు మహంకాళి కొంతకాలంగా మద్యానికి బానిసైనట్లు బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగినట్లు తెలిపారు. గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

యువకుడి అదృశ్యం



రాజ్‌కుమార్

ధర్మారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందని చిప్ప రాజ్‌కుమార్(32) అనే యువకుడు సోమవారం కుమారుడి ఆసుపత్రి కాగితాలు తీసుకువస్తానని ఇంట్లో చెప్పి కరీంనగర్ వెళ్లాడు. రాత్రి వరకు రాకపోవడంతో అతని భార్య ఫోన్‌చేయగా కరీంనగర్ బస్టాండ్‌లో బస్‌కోసం చూస్తున్నానని, నేను వచ్చేసరికి ఆలస్యమవుతుందని చెప్పాడు. మంగళవారం తెల్లవారుజాము వరకు కూడా రాజ్‌కుమార్ రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా ఫోన్ ఎత్తలేదు. ఉదయం మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబసభ్యులు బుదవారం వరకు బంధువులతో పాటు అతనిస్నేహితులకు ఫోన్‌చేసి సమాచారం తెలుసుకోగా రాజ్‌కుమార్ ఆచూకీ లభించలేదు. రాజ్‌కుమార్ తండ్రి చిప్పరవి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో నెమలి మృతి

హుజూరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో బుధవారం జనావాసాల్లో నెమలి ప్రత్యక్షమైంది. పట్టణంలోని ఇల్లందుల వాడలో నెమలి సంచరిస్తుండగా వీధికుక్కలు దాడిచేశాయి. దీంతో నెమలికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన ఓ పాల వ్యాపారి నెమలిని కుక్కలబారి నుంచి కాపాడి అటవీశాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అటవీశాఖాధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమచికిత్స చేద్దామని ప్రయత్నించగా, అప్పటికే నెమలి మృతిచెందింది. మృతి చెందిన నెమలిని అధికారులు పోస్టుమార్టంకు తరలించారు.

విద్యార్థుల కోసం ఎన్‌ఎస్‌పీ పోర్టల్

- స్కాలర్‌షిప్‌ల కోసం డిజిటల్ ప్లాట్‌ఫారం
- ఒకే గొడుగు కిందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు



చొప్పదండి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ విద్యార్థులకు ఆసరాగా నిలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు వివిధ ప్రభుత్వ సంస్థలు విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌లు అన్ని ఒకే గొడుకు కిందకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లోకి తీసుకువచ్చారు. ఎన్‌ఎస్‌పీ ఒక డిజిటల్ ప్లాట్ ఫారంగా నిలుస్తుండగా విద్యార్థులకు మంజూరైన స్కాలర్‌షిప్‌లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి డీబీటీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా జమ చేస్తారు. విద్యార్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే వెరిఫై చేస్తారు. ఈ పోర్టల్‌లో విద్యార్థి ఒకసారి రిజిస్టర్ చేసుకుంటే అన్ని రకాల స్కాలర్‌షిప్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలుంటుంది. విద్యార్థి వివరాలు, బ్యాంకు ఖాతా, ఆధార్, విద్యార్హతను ఈ పోర్టల్ ద్వారా డిజిటల్‌గానే వెరిఫై చేసి స్కాలర్‌షిప్‌ను మంజూరు చేస్తారు.

ఈ స్కాలర్‌షిప్‌లు 1వ తరగతి నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు చదువుతున్న విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. వార్షిక కుటుంబ ఆదాయం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ ఈడబ్ల్యుఎస్ కేటగిరీల వారీగా విద్యార్థులకు 5 వేల నుంచి 50 వేల రూపాయల వరకు స్కాలర్‌షిప్‌లను ఏడాదికి అందజేయనున్నారు.

స్కాలర్‌షిప్ వివరాలు

ఎన్‌ఎస్‌పీలో కేంద్ర ప్రభుత్వం పలు రకాల స్కాలర్‌షిప్‌లను అందజేస్తుంది.



- పోస్టు మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్
- మెరిట్ కంమీన్స్ స్కాలర్‌షిప్
- టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ (ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు మాత్రమే)
- యూజీసీ స్కాలర్‌షిప్, ఇషాన్ ఉదయ్, సింగిల్ గర్ల్ చైల్డ్(పీజీ విద్యార్థులకు)
- ఏఐసీటీఈ-ప్రగతి స్కాలర్‌షిప్(బాలికలు), సక్షం స్కాలర్‌షిప్(దివ్యాంగులు)
- సీఎస్ఎస్ఎస్(సెంట్రల్ సెక్టార్ స్కీమ్ ఆఫ్ స్కాలర్‌షిప్స్-డిగ్రీ, పీజీ విద్యార్థులకు)
- పోస్టు మెట్రిక్ స్కాలర్‌సిప్ ఫర్ ఓబీసీ స్టూడెంట్స్

దరఖాస్తు ప్రక్రియ

ఎన్‌ఎస్‌పీ పోర్టల్‌లో విద్యార్థులు తమ దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలి. ఎన్‌ఎస్‌పీ అధికారిక వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. మొబైల్ నెంబర్ ఎంటర్ చేయగానే ఓటీపీ వస్తుంది. ఓటీపీ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత విద్యార్థి వివరాలు, మెయిల్ ఐడీ, విద్యార్హతలు నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హతల ధ్రువపత్రాలు, బ్యాంకు ఖాతా, సంబంధిత డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేయాలి. అక్టోబర్ 31 వరకు దరఖాస్తులను పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. స్కాలర్‌షిప్ రెన్యువల్ గడువు ఆగస్టు 31 వరకు ఉంది.

11న ఎంజేపీ పాఠశాలలో ఇంటర్వ్యూలు

తిమ్మాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు అతిథి ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఈనెల11న ఇంటర్వ్యూలు, డెమో నిర్వహించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్‌జిల్లా కన్వీనర్ అంజలి ఒకప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్ జువాలజీ(మహిళ), జేఎల్, కెమిస్ట్రీ (మహిళ), జెఎల్ ఇంగ్లీష్(జనరల్), పీజీటీ మాథ్స్ (జనరల్, మహిళ), జెఎల్ మాథ్స్ (మహిళ), పీజీటీ ఫిజకల్‌సైన్స్(జనరల్, మహిళ), పీజీటీ ఇంగ్లీష్(మహిళ), టీజీటీ ఇంగ్లీష్(జనరల్) సబ్జెక్టులు బోధించుటకు అర్హులైన అభ్యర్థులు పీజీ, బీఎడ్ పూర్తిచేసి ఉండాలని తెలిపారు. ఈనెల11న తిమ్మాపూర్ మండలంలో గల మహాత్మా జ్యోతి బాఫూలే బాలికలపాఠశాలలో ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

పెద్దమ్మ దేవాలయంలో చోరీ

శంకరపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరడపల్లి పెద్దమ్మతల్లి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. పెద్దమ్మ దేవాలయంలో అమ్మవారి ముక్కుపుడక, పుస్తెలు, గల్లపెట్టే అపహరణకు గురైనట్లు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

విద్యుత్ వైర్ల చోరీ

శంకరపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరడపల్లి గ్రామంలో ముగ్గురు రైతుల వ్యవసాయ బావుల వద్ద మోటర్లకు అమర్చిన విద్యుత్‌వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు పేర్కొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

వీర్నపల్లి ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం లాల్‌సింగ్ తండా గ్రామంలో గుడుంబా స్థావరాలపై ఎస్సై వేముల లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. మూడు లీటర్ల నాటుసారా సీజ్‌చేసి, 200లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. నాటుసారా తయారుచేసిన భూక్య సునీత, భూక్య ధర్మలపై కేసు నమోద చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో హెచ్‌సీ లచ్చయ్య పీసీలు నవీన్, నయీంపాషా, యాకూబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తున్న పోలీసులు

ఉద్యోగం పేరుతో డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగంలో పెట్టిస్తానని, అందుకు రూ2 లక్షలు కట్టాలని ఫోన్‌లో మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆలయ ఉద్యోగులు సంబంధిత వ్యక్తిపై వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆడియో వైరల్‌పై దేవదాయ ధర్మదాయ రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణరావు విచారణచేసి రిపోర్టు సమర్పించాలని ఆదేశించడంతో రాజన్న ఆలయ ఈవో ఆలయంలోని ఔట్ సోర్సింగ్ సిబ్బందిని సంప్రదించి సదరు గొంతు ప్రణయన్ హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ సర్వీసెస్, శాన్వి సర్వీసెస్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ, శివబాలాజీ కన్సల్టెన్సీ సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తున్న లక్ష్మీనారాయణదిగా భావించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఈవో పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట గ్రామం మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ బూడిద విజయ్, ట్రాక్టర్ యాజమని నోముల తిరుపతి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కరీంనగర్‌లో కార్డెన్ సెర్చ్

- 85 వాహనాలు స్వాధీనం, జరిమానా విధింపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ, టౌన్ ఏసీపీ వెంకటస్వామి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఒకటోఠాణా పరిధిలోని గాయత్రినగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో పోలీసులు బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అడిషనల్ డీసీపీ వెంకటరమణ తెలిపారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా రెండు కాలనీలను పోలీసులు దిగ్బంధించారు. వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో మొత్తం 85 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనా లకు జరిమానా విధించారు.

వివిధ అంశాలపై అవగాహన..

కార్డెన్‌సెర్చ్ అనంతరం స్థానికులకు వివిధ అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే 1930కి కాల్‌చేయడం ద్వారా పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందవచ్చని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకం చట్టరీత్యా నేరమన్నారు. వాటి దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీసీపీ వెంకటరమణ హెచ్చరించారు. అటువంటి సమాచారం ఉంటే డయల్100కు లేదా స్థానికపోలీసులకు తెలియజేయాలని కోరారు. షీటీమ్ సీఐ శ్రీలత మాట్లాడుతూ సోషల్ మీడియాలో జరిగే మోసాలపై అమ్మాయిలను హెచ్చరించారు. అపరిచితులకు ఫొటోలు పంపవద్దని, వేధింపులకు గురైతే భయపడకుండా షీటీమ్‌ను ఆశ్రయించాలని అన్నారు. ఫిర్యాదుచేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అంతకు ముందు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీఐలు బిల్లా కోటేశ్వర్, సృజన్‌రెడ్డి, సదన్ కుమార్, శ్రీలత, పుల్లయ్య పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరస్థుడి అరెస్ట్

- ఆరోగ్యశ్రీ పేరుతో ఆన్‌లైన్ మోసాలు ● వెల్లడించిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పేరుతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర సైబర్‌నేరస్థుడిని అరెస్టు చేసినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన ముల్లుంటి సలీం మాలిక్(32) అనే వ్యక్తి ఢిల్లీకి చెందిన సత్యంతో కలిసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సలీం మాలిక్ ఆరోగ్యశ్రీ డబ్బులు వచ్చాయని బాధితులకు ఫోన్ ద్వారా తెలిపి, ఢిల్లీలో ఉన్న సత్యంకు కాన్ఫరెన్స్ కాల్ కలపగా అతడు బాధితులకు లింక్‌లు పంపేవాడు. లింకును క్లిక్ చేయగానే బాధితుల ఖాతాలో నుంచి డబ్బులు కట్ అయ్యేవి. దీనికి సహాయపడిన సలీంమాలిక్ కొంతడబ్బులు సత్యంకు పంపించేవాడు. జిల్లాలోని ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన రాజిరెడ్డి వీరి ద్వారా రూ.46వేలు మోసపోయి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు సిరిసిల్ల రూలర్ సీఐ మొగిలి సూచనలతో కేసు నమోదు చేసిన ముస్తాబాద్ ఎస్సై గణేష్ దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా సైబర్ టీం ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది కిట్టు, గంగారెడ్డి, ముస్తాబాద్ కానిస్టేబుల్ కాసిం ప్రత్యేక టీమ్‌గా ఏర్పడి సాంకేతికత ఆధారంగా హైదరాబాద్‌లో బుధవారం నిందితుడు సలీం మాలిక్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరోనిందితుడు సత్యం పరారీలో ఉన్నాడని, త్వరలో అతన్నికూడా పట్టుకుంటామని డీఎస్పీ వెల్లడించారు. నిందితులపై తెలుగు రాష్ట్రాల్లో 79 ఫిర్యాదులు ఉన్నాయని, సుమారు రూ.60లక్షలకు పైగా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడ్డారని ఆయన తెలిపారు.



సిరిసిల్లలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చంద్రశేఖర్

పోక్సో కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

పాలకుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్‌పోలీస్‌స్టేషన్ పరిధిలోని కన్నాలలో బాలికనువేధింపులకు గురిచేసిన కన్నం సాగర్(30)కి బుధవారం జిల్లాకోర్టుజడ్జి సునీత ఏడేళ్ల కఠినకారాగారశిక్ష, 11వేల జరిమానా విధించినట్లు బసంత్‌నగర్ ఎస్ఐస్వామితెలిపారు. కన్నాలగ్రామానికి చెందిన బాలిక బడికివెళ్లి తిరిగివస్తున్న సమయంలో ప్రేమపేరుతో సాగర్ వేధించేవాడు. బాలిక తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా సాగర్ బాలిక ఇంట్లోకి వెళ్లగా ఆమెకేకలు వేయడంతో సమీపంలోని ప్రజలు రావడంతో సాగర్ పారిపోయాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదుమేరకు అప్పటి ఎస్ఐ ఉమసాగర్ కేసునమోదుచేసి నిందితుడిని రిమాండ్‌కుతరలించాడని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదంరమేష్, పెద్దపల్లిడీజీపీ పుల్లాకరుణాకర్, ఏసీపిగజ్జికృష్ణ, సాక్ష్యులను ప్రవేశపెట్టడానికి సహకరించిన సీఐ కె ప్రవీణ్‌కుమార్, కోరు సీడీవో వెంకటేశ్వర్లు నేరస్తుడికి శిక్షపడడంలో కృషిచేశారని ఎస్ఐ తెలిపారు.

తీసుకున్న అప్పు ఇవ్వాలని ఇంటి ముందు బైఠాయింపు

గంగాధర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు చెల్లించాలని మాజీ సర్పంచ్ ఇంటిముందు కొందరు బైఠాయించారు. గంగాధర మండలం గర్షకుర్తి మాజీసర్పంచ్ అలువాల నాగలక్ష్మి రెండేళ్ల క్రితం గ్రామంలో మన ఊరు మన బడి పనులు చేపట్టారు. ఇందుకోసం గ్రామంలో కొందరి వద్ద అప్పుతీసుకున్నాడు. పనులు పూర్తి చేసి రెండు సంవత్సరాలు దాటినా బిల్లులు రాకపోవడంతో ఆయన అప్పు చెల్లించలేదు. బుధవారం సర్పంచ్ కుటుంబ సభ్యులు బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి వచ్చేసరికి అప్పులిచ్చిన వారు డబ్బు చెల్లించాలని ఇంటిముందు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో సర్పంచ్ గంగాధర పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాకు పనులు చేసినవి 12లక్షలు రావాల్సి ఉందని రాగానే ఇస్తానని చెప్పిన వినిపించుకోలేదని నాకు బిల్లులు వచ్చేంత వరకు గంగాధర చౌరస్తాలో ధర్నాకు దిగుతానని పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు ఆయనను సముదాయించి ఇంటికి పంపించారు.

అక్రమ ఇసుకను గుర్తించిన పోలీసులు

ధర్మారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాయంపేట గ్రామంలో అక్రమంగా డంప్‌చేసిన ఇసుకను పోలీసులు గుర్తించారు. శాయంపేట శివారులోని ప్రభుత్వభూమి సర్వేనంబర్ 84లో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా ఇసుక నిల్వ చేశారన్న సమాచారం మేరకు బుధవారం ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్రమంగా నిల్వ ఉన్న దాదాపు 15 ట్రిప్పుల ఇసుకకు సంబంధించిన తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్‌చేశారు. శాయంపేట పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్ కుమార్ తెలిపారు. ఆసక్తిగల వ్యక్తులు ఉదయం 10గంటలకు గ్రామపంచాయతీ వద్ద జరిగే వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

ఇసుక డంపును స్వాధీనం చేసుకున్న పోలీసులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామశివారు హనుమాన్‌గుడి వద్ద అక్రమంగా నిల్వఉన్న ఇసుక డంపును బుధవారం పోలీసులు గుర్తించారు. ఈమేరకు వారు డంపులను పరిశీలించి, స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఇసుక సరఫరాపై తహసీల్దార్ అధ్యక్షతన పోలీస్‌స్టేషన్‌లో ఇసుకవ్యాపారులు, ట్రాక్టర్ యజమానులతో సమావేశం నిర్వహించిన మరుసటి రోజునే పెద్ద మొత్తంలో ఇసుక డంపును గుర్తించడం చర్చనీయాంశంగా మారింది.

గుట్టుచప్పుడు కాకుండా కల్తీమద్యం తయారీ

- బ్రాండెడ్ మద్యం సీసాల్లో చీప్ లిక్కర్ నింపి విక్రయం ● ఇద్దరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు



నిందితులను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వేములవాడ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బ్రాండెడ్ మద్యం సీసాల్లో చీప్ లిక్కర్‌ని నింపి విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వేములవాడ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్‌రావు వివరాలను వెల్లడించారు. వేములవాడ మండలంలోని రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన తునికి కార్తీక్ బ్రాండెడ్ కంపెనీలకు చెందిన ఖాళీ మద్యంసీసాలను సేకరించి వాటిలో చీప్‌లిక్కర్ నింపి స్థానికంగా విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం కార్తీక్ ఇంటికి వెళ్లి తనిఖీలు నిర్వహించగా ఖాళీసీశ్ల సీసాలలో నింపిన మద్యంతో పాటు పలు బ్రాండెడ్ సీసాల్లో నింపిన మద్యం లభించిందన్నారు. కార్తీక్‌ను విచారించగా వేములవాడ పట్టణానికి చెందిన దామరపల్లి సంతోష్ అనే మరోయువకుడి సాయంతో 6నెలలుగా ఈ అక్రమ దందా నిర్వహిస్తున్నట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. దీంతో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని కార్తీక్ వద్ద నుంచి 9రెండు లీటర్ల వాటర్ బాటిల్స్, మరో 9లీటర్ వాటర్ బాటిల్స్, 3సిగ్నేచర్ బాటిల్స్‌లోని మద్యాన్ని, సంతోష్ వద్ద గల 750 మిల్లీలీటర్ల పరిమాణంలో 3సిగ్నేచర్, 3 విలయమ్సన్, ఐబీ, ఆర్‌సీ, రెడ్‌లేబుల్, రాయల్ గ్రీన్ ఒక్కో బాటిల్స్‌తో పాటు మరో అరలీటర్ మద్యం బాటిల్స్‌తోకలిపి సుమారుగా రూ.50 వేల విలువగల మద్యాన్ని సీజ్ చేశారు. గత 6 నెలలుగా సుమారు రూ.2 లక్షల వ్యాపార లావాదేవీలు కొనసాగించినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. ఇద్దరిని కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై రవి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై శైలజ సిబ్బంది ఉన్నారు.

కరెంటు కోతలపై రైతుల కన్నెర్ర

- రోడ్డుపై బైఠాయించి ఆందోళన

గంభీరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కరెంటు కోతలపై రైతుల కన్నెర్ర చేశారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడటంతో పంటలు ఎండిపోతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. గంభీరావుపేట మండలం కొత్తపల్లి విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలోని రాజుపేట, కొత్తపల్లి, కోళ్ళమద్ది శ్రీగాధ గ్రామాలకు చెందిన రైతులు కరంటు కోతలపై బుధవారం ఆందోళన చేపట్టారు. సెస్ ఏఈ అక్కడికి చేరుకుని వారం రోజుల్లో విద్యుత్ సమస్య లేకుండా చూస్తానని హామీఇవ్వడంతో రైతులు శాంతించారు. ఆందోళనలో రైతులతోపాటు కొత్తపల్లి సింగిల్‌విండోఛైర్మన్ భూపతిసురెందర్, మాజీసర్పంచ్‌లు అల్లె సత్యం, నాగరాజుగౌడ్, మాజీ ఉపసర్పంచ్ మహేష్, గౌసొద్దీన్, సత్యం, సుదాకర్, రమేష్, నరేష్,కిషన్,రాజు,ఎల్లారెడ్డి,సుదర్శన్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామశివారులోని గుడిసెలో అక్రమంగా నిల్వచేసిన 10క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన నర్రావుల కొమురయ్య కొంతకాలంగా అక్కపల్లి గ్రామంలో నివసిస్తున్నాడు. పీడీఎస్ బియ్యం నిల్వ చేశాడనే సమాచారంతో సోదాచేయగా 10క్వింటాళ్లు లభించాయని చెప్పారు. బియ్యాన్ని స్వాధీనపర్చుకుని కొమురయ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

తిమ్మాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణకాలనీ గ్రామం వద్ద రాజీవ్‌రహదారిపై బుధవారం రాత్రి పెనుప్రమాదం తప్పింది. హైదరాబాద్‌వైపు నుంచి కరీంనగర్‌వైపు వెళుతున్న ఓ కారు రామకృష్ణాకాలనీ వద్ద రాజీవ్‌రహదారిపై అదుపుతప్పి రోడ్డుమధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంటూ కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపు వెళుతున్న మరో కారును ఢీకొంది. ఈప్రమాదం జరిగినవెంటనే అటునుంచి హైదారాబాద్ వెలుతున్న ఆర్టీసీ బస్సును డ్రైవర్‌ఒక్కసారిగా నిలిపేశాడు. దాని వెనుకల నుంచి మినీగూడ్స్ ట్రక్కు వేగంగావచ్చి బస్సులను ఢీకొంది. దీం తో బస్సు మినీట్రక్కురోడ్డుపై ఇరుక్కుపోయాయి. దీంతో దాదాపు కిలోమీటర్‌కు పైగావాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బ్లూకోట్స్ సిబ్బంది స్థానికులసహాయంతో ట్రాఫిక్‌ను క్రమ బద్ధీకరించారు. ఈప్రమాదంలో మాధవి అనేమహిళ స్వల్పగాయాలతో బయటపడింది.

మావోయిస్టు అగ్రనేత మల్లా రాజిరెడ్డికి అరెస్టు వారెంట్ జారీ

మంథని, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుపార్టీ కేంద్రకమిటీసభ్యుడు మల్లా రాజిరెడ్డిపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లా సెషన్స్‌కోర్టు అరెస్టు వారెంట్ జారీచేసింది. పెద్దపల్లిజిల్లా మంథని మండలం శాస్త్రులపల్లి మల్లారాజిరెడ్డి స్వగ్రామం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ ఎస్ఐ ఆర్‌కేసేతియా, కానిస్టేబుల్ మనోహర్ కోర్టువారెంట్‌తో బుధవారం శాస్త్రులపల్లికి వచ్చారు. మల్లా రాజిరెడ్డి అజ్ఞాతంలో ఉండడం, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అరెస్ట్‌వారెంట్‌ను స్థానికపోలీసుల సహాయం తో ఇంటితలుపునకు అంటించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో అరెస్టు వారెంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆర్‌కే సేతియా మాట్లాడుతూ మల్లారాజిరెడ్డిపై క్రైం నెం.09/25ప్రకారం వివిధసెక్షన్లకింద కేసులు బీఎన్ఎస్ 191(2),191(3),190,109, బీఎన్ఎస్ 25,27, ఆంసెంట్13,38(2), 39(2) యూఏపీఏ సెక్షన్లకింద కేసులు నమోదయ్యా యని, వీటిపై కాంకేర్ సెషన్స్ కోర్టు వారెంట్‌జారీ చేసిందన్నారు. సెప్టెంబర్ 11న మల్లా రాజిరెడ్డి కాంకేర్‌సెషన్స్ కోర్టులోహాజరు కావాలన్నారు.



శాస్త్రులపల్లిలో రాజిరెడ్డి ఇంటికి వారెంట్ అంటిస్తున్న ఛత్తీస్‌గఢ్ పోలీసులు

జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో మంత్రులు


ధర్నాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, శ్రీధర్‌బాబు, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఒడితెల ప్రణవ్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా రాహుల్ గాంధీ నాయకత్వంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బుధవారం చేపట్టిన ధర్నాలో జిల్లా మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్, ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, హుజూరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్‌బాబు, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, పత్తి కృష్ణారెడ్డి, మునిగింటి అనిల్‌కుమార్, పొన్నం సత్యం, బోనాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ అధ్యాపకులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి

గణేశ్‌నగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ అటనామస్ కళాశాల కామర్స్ విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ ఎం.మల్లారెడ్డి తెలుగు విభాగాధిపతి డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.సతీష్ కుమార్‌కు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ తెలిపారు. కెరియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీంలో భాగంగా పదోన్నతి పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన అధ్యాపకులను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు అభినందించారు.

హోటల్‌లో ఫుడ్ పాయిజన్

బాలుడికి అస్వస్థత

జగిత్యాల, అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో ఉన్న శివసాయి హోటల్‌లో బుధవారం ఫుడ్ పాయిజన్‌తో విక్రాంత్ అనే బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బుధవారం హోటల్‌లో దోశ తిన్న విక్రాంత్ అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలుడు ఫుడ్ పాయిజన్‌కు గురైనట్లు వైద్యులు తెలిపారని బాలుడి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కాగా గతంలోనూ శివసాయి హోటల్‌లో ఫుడ్ పాయిజన్ జరగగా పలువురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు దానిని సీజ్ చేశారు. కానీ రెండు, మూడు రోజులకే మళ్లీ హోటల్‌ను తెరిచి నడిపిస్తున్నారు. తాజాగా బుధవారం హోటల్‌లో మరోసారి బాలుడికి ఫుడ్ పాయిజన్ కావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై పలు విమర్శలు వస్తున్నాయి.

నేటి నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల



- అన్నదాతలకు శుభవార్త చెప్పిన శివం కమిటీ
- వారబందీ పద్ధతిలో సరఫరా
- ఊపందుకోనున్న వానాకాలం పంటల సాగు

జగిత్యాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడానికి షెడ్యూల్ ఖరారైంది. ఎస్సారెస్పీ నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్న రైతాంగానికి శివం కమిటీ సమావేశం శుభవార్త చెప్పింది. బుధవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన రాష్ట్ర స్థాయి సమీకృత నీటి ప్రణాళిక యాజమాన్య కమిటీ (ఎస్‌సీఐడబ్ల్యూఏఎం) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గురువారం నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వారాబందీ పద్ధతిలో నీటిని సాగు కాలువలకు విడుదల చేయనున్నారు.

ఎస్సారెస్పీ జోన్-1 కింద గల డిస్ట్రిబ్యూటరీ కాలువ 1 నుంచి 53వ డిస్ట్రిబ్యూటరీ వరకు మొదటి ఏడు రోజులు నీటిని విడుదల చేస్తారు. ఎస్సారెస్పీ జోన్-2 కింద గల డిస్ట్రిబ్యూటరీ కాలువ 54 నుంచి 94 డిస్ట్రిబ్యూటరీ వరకు తదుపరి ఏడు రోజులు నీటిని విడుదల చేయనున్నారు. ఇలా వారాబందీ పద్ధతిలో వానాకాలం పంట సాగు ముగిసే వరకు అవసరమైన నీటిని అన్నదాతలకు అందించడానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు ప్రణాళిక రూపొందించారు.



నేడు కాకతీయ కాలువకు...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని గురువారం ఉదయం 11 గంటలకు కాకతీయ కాలువకు విడుదల చేయనున్నారు. అదేవిధంగా లక్ష్మీ కాలువ, సరస్వతీ కాలువలు, ఎత్తిపోతల పథకాలకు సైతం నీటిని విడుదల చేయనున్నారు. గత యేడాది సైతం ఆగస్టు మొదటి వారంలో శ్రీరాంసాగర్ నీటిని వారాబందీ పద్ధతిలో విడుదల చేశారు. ఎస్సారెస్పీ అధికారులు ఇచ్చిన నివేదికకు అనుగుణంగా కాకతీయ కాలువకు 5 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 350 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 900 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 550 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి నిర్ణయించారు.

వర ప్రదాయిని శ్రీరాంసాగర్..

జిల్లాలో రెండు మండలాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో శ్రీరాంసాగర్ కాకతీయ కాలువ ఆయకట్టు పరిధిలో ఉంది. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, కొడిమ్యాల వంటి మండలాలకు ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా సాగు నీరు అందుతోంది. జిల్లా రైతాంగానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరప్రదాయినిగా ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద జగిత్యాల జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కాగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారు 1.60 లక్షలు, ఆదిలాబాద్‌లో 1.45 లక్షలు, కరీంనగర్‌లో 6.72 లక్షలు, వరంగల్‌లో 4.71 లక్షలు, ఖమ్మంలో 1.28 లక్షలు, నల్లగొండలో 2.87 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. జగిత్యాల జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 4.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారన్న అంచనా ఉంది. ఇందులో వరి 3.5 లక్షల ఎకరాలకు పైగా సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు.

ఆయకట్టు రైతుల ఆశలు సజీవం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతుల ఆశలు సజీవంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టును 1983లో జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. మాన్యువల్ ఆధారంగా ప్రాజెక్టు గేట్లను నిర్మాణం చేశారు. ప్రాజెక్టుకు వరదలు వచ్చే సమయంలో పెద్ద మొత్తంలో వరద వచ్చి చేరుతోంది. ఆ సమయంలో ప్రాజెక్టులోని మొత్తం 42 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తారు.

కాగా ఇటీవల మహా రాష్ట్రలోని గోదావరి నదిపై ప్రాజెక్టు ఎగువన నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను కొన్ని రోజుల క్రితం ఎత్తారు. దీంతో గోదావరి ఎగువ ప్రాంతం నుంచి నీరు వస్తోంది. దీనికి తోడు మహా రాష్ట్రలోని విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ ప్రాజెక్టులో నిండుగా ఉండడంతో దిగువకు నీటిని వదులుతున్నారు. దీంతో నీటి మట్టం పెరుగుతోంది. ప్రస్తుతం డ్యామ్‌లో నిల్వ ఉన్న నీటికి తోడు మరో ఒకటి, రెండు టీఎంసీల నీరు వచ్చి చేరితే ఆయకట్టు వానాకాలం పంటలకు ఢోకా ఉం డదని రైతులు ఆశతో ఉన్నారు. 45 టీఎంసీల నీరు ఉంటే తాగునీటి అవసరాలు, ఆవిరి రూపంలో పోయే నీటి లెక్కలు కలుపుకొని వానాకాలంలో ప్రాజెక్టు ఆయకట్టుకు నీరు సరఫరా చేపడుతారని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

ప్రాజెక్టులో ప్రస్తుత నీటి పరిస్థితి ఇలా..

ఎస్సారెస్పీలోకి వరద నీరు రావడం బుధవారం కొనసాగింది. డ్యామ్‌లోకి 2,620 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 40.582 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 793 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజె క్టు లోకి 31.552 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 3.757 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే..: శ్రీనివాస్‌రావు, ఎస్ఈ, పోచంపాడ్ ప్రాజెక్టు



ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రస్తుత వానాకాలం పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడానికి నిర్ణయించాం. హైదరాబాద్‌లో జరిగిన శివమ్ కమిటీ సమావేశంలో సాగు నీటి విడుదల ప్రణాళికను ఖరారు చేశారు. గురువారం నుంచి ఎస్సారెస్పీ నీటిని కాలువల ద్వారా వారాబందీ పద్ధతిలో విడుదల చేయనున్నాం.

నీటి విడుదలను స్వాగతిస్తున్నాం : మహేందర్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు, జగిత్యాల



వర్షాకాలం పంటలకు శ్రీరాంసాగర్ నీటి విడుదల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రస్తుతం కొందరు రైతులు నార్లు పోయడం, నాట్లు వేయడం వంటి పనులు పూర్తి చేసి కాలువల నీటి కోసం ఎదురు చూస్తున్నారు. సరియైన సమయంలో నీటి విడుదల నిర్ణయం తీసుకోవడం హర్షణీయం.

10న ఉమ్మడి జిల్లాస్థాయి ఆహ్వానిత ఖో-ఖో పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉమ్మడి జిల్లా స్థాయి ఆహ్వానిత ఖో-ఖో పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేం దర్‌రావు తెలిపారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పోటీల్లో సిరిసిల్ల జిల్లా నుంచి రెండు, పెద్దపల్లి జిల్లా నుంచి రెండు, జగిత్యాల జిల్లా నుంచి రెండు, కరీంనగర్ జిల్లా నుంచి రెండు జట్లు చొప్పున పాల్గొనవచ్చని తెలిపారు.

సిరిసిల్ల క్రీడాకారులు ఎస్‌కే మోయినుద్దీన్‌ను, పెద్దపల్లి జిల్లా క్రీడాకారులు డాక్టర్ వేల్పుల కుమార స్వామిని, జగిత్యాల క్రీడాకారులు డాక్టర్ ఎ.రవీందర్, కరీంనగర్ జిల్లా క్రీడాకారులు వి.సూర్య ప్రకాష్‌ను సంప్రదించాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే జట్లకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించినట్లు తెలిపారు. పురుషుల విభాగంలో నిర్వహించనున్న ఈ పోటీలతో పాటు ఉదయం 10 గంటలకు ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఉంటుందని కార్యదర్శి తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో కాంగ్రెస్ డ్రామా..

- 10శాతం ముస్లిం రిజర్వేషన్ తీసివేస్తే మద్దతు...
- కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఓబీసీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలి...
- కాళేశ్వరం అవినీతితో ఆ నలుగురే...
- ఈటల ప్రమేయం ఉండదు...
- తుమ్మిడి హెట్టితో ఉమ్మడి ఆదిలాబాద్‌కు నీళ్లు ఇవ్వాలి..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

గోదావరిఖని, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై రాహుల్‌గాంధీ డైరక్షన్‌లో ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ డ్రామాలు చేస్తుందని, నాయకులు యాక్టర్లుగా, పెయిడ్ ఆర్టిస్టులుగా మారారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. బుధవారం గంగానగర్‌లో బీజేపీ నాయకుడు అమరేందర్‌రావు నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేసి ఇప్పుడు ఢిల్లీకి ఎందుకు వెళ్లారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు ఆడుతున్నారన్నారు.

అసెంబ్లీలో 42శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెడతామని బీజేపీకి చెందిన 8మంది ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చారని, తరువాత 42 శాతం రిజర్వేషన్‌లో 10శాతం ముస్లింలకు ఇస్తామని చెబుతున్నారని, దీంతో అసలైన బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో వైఎస్‌ఆర్ హయాంలో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ ఇస్తేనే వివాదం జరిగిందని, కోర్టులో వివాదం ఇంకా కొనసాగుతుందన్నారు. ఓబీసీల్లో బీజేపీకి పెరుగుతున్న మద్దతును తట్టుకోలేక బీజేపీని బీసీలకు దూరం చేసేందుకు బీసీ బిల్లు పేర కాంగ్రెస్ కుట్ర చేస్తుందన్నారు. ముస్లిం రిజర్వేషన్లను తీసివేస్తే తాము మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. రాహుల్ కుటుంబం నుంచి ప్రధాని అభ్యర్థి ఎవరు ఉండరని, ఓబీసీలే తమ ప్రధాని అభ్యర్థి అని కాంగ్రెస్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో కేసీఆర్ కుటుంబానికి చెందిన నలుగురే బాధ్యులని, ఈటలకు సంబంధం ఉండదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నిపుణులను, ఐఏఎస్ అధికారులను ఎవరిని పరిగణలోకి తీసుకోలేదన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలనే బీజేపీ డిమాండ్ అన్నారు. రాష్ట్రంలో రైతాంగానికి అవసరమైన యూరియాను కేంద్రం అందిస్తుందని, రాష్ట్రంలో మాత్రం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తుపెట్టుకోబోమని, గెలుపు గుర్రాలకే టికెట్టు ఇస్తామన్నారు. ఎస్సీ మోర్చ కార్యదర్శి ఎస్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, మాజీ ఎంపీ వెంకటేష్‌నేత, గోమాస శ్రీనివాస్, కాసిపేట లింగయ్య, రావుల రాజేందర్, బల్మూరి వనిత, కందుల సంధ్యారాణి, సోమారపు లావణ్య, మేరుగు హన్మంతుగౌడ్, మనోహర్‌రెడ్డి, పాల్గొన్నారు.

రచయితకు సమగ్ర దృష్టి ఉండాలి

- జస్టిస్ చంద్రకుమార్
- విమలక్కకు జయశంకర్ స్ఫూర్తి పురస్కారం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రచయితకు సమ్యక్ సమగ్ర దృష్టి ఉండాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో డికె ఫౌండేషన్ చైర్మన్ దేవరకొండ కాళిదాసు పురస్కార ప్రదాతగా ప్రతియేటా ప్రదానం చేసే ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్మారక రాష్ట్ర స్థాయి స్ఫూర్తి పురస్కారాన్ని 2025 సంవత్సరానికి బుధవారం కరీంనగర్ ఫిలింభవన్‌లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కకు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ మానవీయ విలువలను పెంపొందించేందుకు కవులు, రచయితలు తమ కలాల్ని, గళాల్ని ఎక్కు పెట్టాలని అన్నారు. నాలుగు దశాబ్దాలుగా అవిశ్రాంత పోరుబాటగా ప్రతిధ్వనిస్తున్న విమలక్కకు పురస్కారం ప్రదానం చేయటం సముచితంగా ఉందని అన్నారు.

విమలక్క మాట్లాడుతూ తన పోరుబాటకు ఈ పురస్కారం తగిన గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి, బూర్ల వేంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీవి కుమార్, దామరకుంట శంకరయ్య, డాక్టర్ నలిమెల భాస్కర్, పొన్నం రవిచంద్ర, గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, నగునూరి శేఖర్, కందుకూరి అంజయ్య, సదాశ్రీ తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు పాల్గొన్నారు.


విమలక్కకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి పురస్కారాన్ని అందజేస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, తెరవే ప్రతినిధులు, మాట్లాడుతున్న చంద్రకుమార్

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

16 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

జగిత్యాల క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా దొంగను జగిత్యాల పట్టణ పోలీసులు అరెస్టు చేసి 16 తులాల బంగారు నగలతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. రాయికల్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన అత్తినేని చంద్రమోహన్(29) జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నాడు. శంకులపల్లి శివారులో బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా చంద్రమోహన్ పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. విచారణలో ఇటీవల జిల్లాలో పలు ప్రాంతాల్లో ఏడు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డ వ్యక్తి చంద్రమోహన్‌గా గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. చంద్రమోహన్‌పై పలు జిల్లాల్లో 25 క్రిమినల్ కేసుల తో పాటు పీడీ యాక్ట్ కింద జైలుకు సైతం వెళ్లివచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐ కరుణాకర్, ఎస్సై సుప్రియ ఉన్నారు.

సౌదీ నుంచి వస్తూ గుండెపోటుతో యువకుడి మృతి

ముంబైలో విమానం అత్యవసర ల్యాండింగ్



శ్రీధర్ (ఫైల్)

కోరుట్ల రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సౌదీ నుంచి స్వస్థలానికి వస్తూ కోరుట్లకు చెందిన శ్రీ రాముల శ్రీధర్ (46) గుండె పోటుతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. శ్రీరాముల శ్రీధర్ ఎనిమిది నెలల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. బుధవారం తెల్ల వారుజామున సౌదీ నుంచి హైదరాబాద్‌కు విమానంలో వస్తుండగా మార్గమధ్యలో గుండె పోటు వచ్చింది. దీంతో విషయాన్ని విమాన సిబ్బందికి తెలపగా వారు వెంటనే ముంబైలో విమానాన్ని అత్య వసర ల్యాండింగ్ చేశారు. డాక్టర్లు అతడికి సీపీఆర్ చేయగా ఎలాంటి చలనం లేకపోవడంతో మరణించాడని ధ్రువీకరించారు. మృతుడికి భార్య వీణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు పమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రంగంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మన్‌రావు తెలిపారు. 35 నుంచి 40 ఏళ్ల వయస్సు, కుడి ఛాతి మీద త్రిశూలం డమరుకం పచ్చ బొట్టు, ఎడమ భుజంపై త్రిశూలం, కుడి చేతి పై గిటార్, కత్తి, పూలతో కూడిన పచ్చబొట్లు ఉన్నాయన్నారు. మృతదేహాన్ని పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. సమాచారం తెలిసిన వారు పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై 87126 56506, సీఐ 8712656505 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఊసే లేని ఆర్టీసీ విలీనం



- కార్మికుల ఎదురు చూపులు
- ఉద్యోగుల్లో అభద్రతా భావం
- యూనియన్లు లేక అటకెక్కిన డిమాండ్లు

భగత్‌నగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విలీన ప్రక్రియ ఊసే లేకుండా పోయింది. ప్రభుత్వంలో ఆర్టీసీతో పాటు, ఆ సంస్థ ఉద్యోగుల విలీన ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తోందని కార్మికులు అభిప్రాయపడుతున్నారు. కరీంనగర్ రీజి యన్ వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, మెట్ పల్లి, కోరుట్ల, జగిత్యాల, వేములవాడ, సిరిసిల్ల, హుస్నాబాద్, మంథని, గోదావరిఖని డిపోలు ఉన్నాయి. గత ప్రభుత్వం విలీన ప్రక్రియను తెరపైకి తీసుకొచ్చి అసెంబ్లీలో బిల్లు అమోదించి గవర్నర్‌కు పంపించింది. ఆ తర్వాత బిల్లుకు ఆమోద ముద్ర పడినా ఎన్నికల కోడ్‌తో ఆ తతంగం నిలిచి పోయింది.

కాంగ్రెస్ ఆర్టీసీని, కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చినా విలీన అంశాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులతో ఇప్పటికి వరకు చర్చలపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత ప్రభుత్వం విలీనంపై ప్రణాళికను సిద్ధంచేయక పోవడంతో విలీనం ఉంటుందా లేదా అని ఉద్యోగ, కార్మికులు సందిగ్ధంలో ఉన్నారు.

ఉద్యోగుల్లో అభద్రతా భావం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడ్డాక హామీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నా విలీన ప్రక్రియపై చర్చలు నిర్వహించక పోవడం, నిర్ణయం తీసుకోక పోవడంతో కార్మికులు అసహనానికి గురవుతున్నారు. ఉద్యోగుల హక్కుల కోసం కొద్ది రోజుల క్రితం ఆర్టీసీ కార్మికులు దశలవారీగా ఆందోళనలు చేపట్టారు. కొన్ని సంఘాలు సమ్మెకు సైతం పిలుపునివ్వడం, ఆ తర్వాత నాయకులు యూనియన్లతో చర్చించడం, సమ్మె నిలిపి వేయడం వంటివి చోటు చేసుకున్నాయి. విలీన ప్రక్రియ నిర్వహించక పోవడంతో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఉద్యోగ భద్రతపై అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతన్నారు.

అటకెక్కిన డిమాండ్లు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో యూనియన్లు లేకపోవడంతో ఆర్టీసీ కార్మికుల డిమాండ్లన్నీ అటకెక్కాయని కార్మికులు వాపోతున్నారు. ప్రధానంగా కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, 2021 పేస్కేల్, ఉద్యోగ భద్రత, యూనియన్ల పునరుద్ధరణ, రిటైర్ ఉద్యోగులకు 2017 పేస్కేల్ బకాయిలు, కార్మికుల నియమకాలు రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్వహించాలంటున్నారు. అదే విధంగా కార్మికులపై ఉన్న పనిభారాన్ని తగ్గించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూపు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ నిర్ణయం కోసం కార్మికులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ విలీన ప్రక్రియను అంశాన్ని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని కార్మికులు అంటున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ముగ్గురికి గాయాలు

వెల్గటూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం కప్పారావుపేట దగ్గర బుధవారం ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బైక్‌తో పాటు యువకుడు బస్సు కిందికి చొచ్చుకుపోగా అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం టీఎస్ 19 జడ్ 0029 నంబరు గల మంచిర్యాల డిపో సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి మంచిర్యాల వైపు వస్తోంది. బస్సు కప్పారావుపేట మసీదు వద్దకు వస్తున్న క్రమంలో ఓ స్కూల్ బస్సు కిషన్‌రావుపేటకు వెళ్లడానికి కుడివైపు తిరుగుతుండగా వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ స్కూల్ బస్సును తప్పించే క్రమంలో ఎదురుగా పాశిగామకు చెందిన కాంద్రపు మహేష్, రాయపట్నంకు చెందిన పోతరాజుల కమలాకర్, పిట్టల చందులు వస్తున్న టీజీ 21 4853 నంబరు గల ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న మహేష్ బైక్‌తో పాటు బస్సు కిందికి చొచ్చుకు పోయాడు. మరో ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. క్షతగాత్రులను పోలీసులు ఆసుపత్రికి తరలించారు.


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

● సంక్షిప్తంగా..

గణేశ్‌నగర్: గోవాలోని డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో గురువారం నిర్వహించనున్న జాతీయ ఓబీసీ మహాసభకు ఉమ్మడి జిల్లా నుంచి బీసీ సంక్షేమ, అనుబంధ సంఘాల నాయకులు బుధవారం బయల్దేరారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా సంక్షేమశాఖ సమన్వయ కర్త శైలజ సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వీణవంక: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులకు బుధవారం సైబర్ జాగృత దివస్ సందర్భంగా ఎస్‌ఐ తిరుపతి అవగాహన కల్పించారు.

గంగాధర: చొప్పదండి మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో ఎస్సై వంశీకృష్ణ సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు.

చొప్పదండి: చొప్పదండి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో మహేశ్వర్ బుధవారం సందర్శించారు. భూ భారతి దరఖాస్తుల వివరాలను తహసీల్దార్ నవీన్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని సాంఘిక సంక్షేమగురుకుల బాలుర పాఠశాలలో వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

రామడుగు: మండలంలోని రంగసాయిపల్లిలో ఘర్‌ఘర్ బీజేపీ మహా సంపర్క్ అభియాన్ సందర్భంగా ఇంటింటికి బీజేపీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు.

భగత్‌నగర్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర బీసీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ ప్రకటలో డిమాండ్ చేశారు.

గంగాధర: ప్రజాకార్యాలయంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మనోహర్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

తిమ్మాపూర్: మండలంలోని గొల్లపల్లిలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మామిడి అనిల్‌కుమార్ లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.

రామడుగు: మండలంలోని వెదిర ఎస్సీ బాలురహాస్టల్‌లో మైత్రి గ్రూప్ ఆఫ్‌చైర్మన్ డాక్టర్ కొత్తజయపాల్‌రెడ్డి పెళ్లి రోజు సందర్భంగా ఆలిండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్ రెడ్డి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

జమ్మికుంట: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ చేపట్టిన ధర్నాలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీనియర్ నాయకుడు దేశిని కోటి పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండిలో రేకుర్తి కంటి ఆసుపత్రి, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 70 మందికి పరీక్షలు నిర్వహించగా 30మందికి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు గుర్తించారు.

తిమ్మాపూర్: ఈనెల13న దేశవ్యాప్తంగా చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుంకరి సంపత్, ఉపాధ్యక్షుడు మాతంగి శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక, రైతుసంఘాల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి





నివాళులర్పిస్తున్న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాయలంలో తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ నివాళులర్పించారు. అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్లు వేణు మాధవ్, ఖాదర్ మోహియుద్దీన్ పాల్గొన్నారు.

కరీంనగర్ క్రైం: పోలీసు కమిషనరేట్‌లో అడిషనల్ డీసీపీ వెంకటరమణ నివాళి అర్పించారు. అడిషనల్ డీసీపీ (ఏఆర్) భీంరావు, ఆర్‌ఐలు రజినీకాంత్, జానిమియ, శ్రీధర్‌రెడ్డి, సీఐ వెంకటేష్ పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండల పరిషత్‌లో ఎంపీడీవో సంజీవరావు, నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మాలతి పాల్గొన్నారు.

భగత్‌నగర్: కరీంనగర్ ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరంలో రీజనల్ మేనేజర్ బి.రాజు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ ఎస్.భూపతిరెడ్డి నివాళులర్పించారు.

సుభాష్‌నగర్: నగరంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహంవద్ద రైతు ప్రజాసంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు నివాళులర్పించారు.

గణేశ్‌నగర్: టీజీ ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఎస్‌ఈ కరీంనగర్ రమేష్ బాబు నివాళులర్పించారు. డీఈలు పాల్గొన్నారు.

హుజూరాబాద్/చిగురుమామిడి/చొప్పదండి/జమ్మికుంట/శంకరపట్నం: హుజూరాబాద్ పట్టణంలోని గ్రంథాలయం, మున్సిపాలిటీతోపాటు పలు ప్రభుత్వకార్యాలయాల్లో, పాఠశాలల్లో ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి అర్పించారు. చిగురుమామిడి మండల కేంద్రంలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో, గ్రామాల్లో, చొప్పదండిలో, శంకరపట్నం మండల కేంద్రంలోని విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం మండలాధ్యక్షుడు సదానందచారి ఆధ్వర్యంలో జయంతి నిర్వహించినారు.

జమ్మికుంట: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో, ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

విద్యార్థులకు జీవన నైపుణ్యాలు నేర్పించాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోపాటు జీవన నైపుణ్యాలు నేర్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సప్తగిరికాలనీ కేజీబీవీలో జిల్లాలోని 14 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు 2 చొప్పున కుట్టు మిషన్లు, 11 మోడల్ స్కూల్ బాలికల హాస్టళ్లకు రిఫ్రిజిరేటర్లు, దోమల నియంత్రణ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు కుట్టు మిషన్ల శిక్షణ నేర్పించేందుకు ఇన్‌స్ట్రక్టర్లను నియమించినట్లు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా విద్యాధికారి చైతన్య జైనీ, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి పాల్గొన్నారు.

మానకొండూర్‌లో డ్రైనేజీ సమస్యకు మోక్షం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



ఆదర్శనగర్‌లో చేపట్టిన పనులు

మానకొండూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శనగర్‌లో 'పడకేసిన పారిశుధ్యం' అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో గత నెల 27న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మానకొండూర్ గ్రామ కార్యదర్శి రేవంత్‌రెడ్డి ఆదర్శనగర్‌లో మురికికాల్వ నిర్మాణానికి బుధవారం పనులు ప్రారంభించారు. కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభాగ్యులను గుర్తించాలి

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, ప్రధాన కూడళ్ల వద్ద ఉండే అనాథలు, అభాగులు, మతి స్థిమితం లేని వారిని, కుటుంబ సభ్యులకు దూరమైన వారిని గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ అశ్విని తానాజి వాకడే, పోలీస్, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారికి తాత్కాలికంగా వసతి ఏర్పాటు చేయాలని, కుటుంబ సభ్యులకు అప్పగించాలని అన్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సతీష్, సీఐ రవీందర్, మెప్మా పీడీ వేణు మాధవ్ రెడ్డి, వీబీ ఫౌండేషన్ నిర్వాహకుడు వీరమాధవ్ పాల్గొన్నారు.

విద్యానగర్, రేకుర్తిలో పర్యటించిన కమిషనర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగర్, రేకుర్తిలో బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పర్యటించారు. నగరంలోని 17, 18, 19, 38, 39 డివిజన్ల వార్డు కార్యాలయాలను తనిఖీ చేశారు. అనంతరం 19వ డివిజన్‌లో చెరువుతోపాటు డ్రైనేజీ కల్వర్టును పరిశీలించారు. కార్యక్రమయంలో డిప్యూటీ కమిషనర్లు వేణు మాధవ్, ఖాదర్ మోహియోద్దీన్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులు విజయ సాధనలో ముందుండాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు విజయ సాధనలో ముందుండాలని సాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. కొత్తపల్లి అల్ఫోర్స్ సీబీఎస్‌ఈ ఉన్నత పాఠశాలలో బుధవారం సీబీఎస్‌ఈ క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నీస్ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలతో ఉన్నత శిఖరాలను చేరేందుకు అవకాశాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రం నుంచి ఒలింపిక్ స్థాయికి ఎదిగిన క్రీడాకారుల స్ఫూర్తితో క్రీడాకారులు ముందంజలో నిలవాలన్నారు. క్రీడాకారులకు నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది కావాలన్నారు. విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల వార్షిక ప్రణాళికలో భాగంగా క్రీడలు, వ్యాయామాన్ని ఒక భాగంగా చేసి ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులతో శిక్షణను అందిస్తున్నామన్నారు. గతంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలను నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి క్లస్టర్ సెవెన్‌లోని 30 పాఠశాలల క్రీడాకారులు పాల్గొంటున్నారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, పోటీల రాష్ట్ర పరిశీలకులు పద్మారావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు నందెల్లి మహిపాల్, ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, జిల్లా టేబుల్ టెన్నీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శరత్ కుమార్‌రెడ్డి, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

మహా సరస్వతీ అమ్మవారికి అభిషేకం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక యజ్ఞవరాహక్షేత్రంలోని వాగ్వాదినీ మహా సరస్వతీ అమ్మవారికి బుధవారం శ్రావణమాస మూలా నక్షత్రం సందర్భంగా అభిషేకం నిర్వహించారు. శ్రావణ శుద్ధ ద్వాదశి పర్వదినం సందర్భంగా బుధవారం రమా సత్యనారాయణస్వామివారికి సంస్థానం ట్రస్టీ మాదాడి కృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో నూతన స్వర్ణ తాపడ మకరతోరణ సమర్పించారు.

వరాహజయంతితోపాటు వేద ప్రచారానికి ప్రాముఖ్యతనిచ్చిన క్షేత్ర నిర్మాత, పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి గురువు స్మృతిలో గురువారం ఉదయం 7 గంటల నుంచి యజ్ఞవరాహస్వామికి వారాభిషేకం, వేద విద్వత్ సభ నిర్వహించనున్నట్లు సర్వవైదికసంస్థానం మేనేజింగ్‌ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తులను పరిష్కరించాలి

ఇల్లందకుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న భూ భారతి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని హుజూరాబాద్ ఆర్డీవో రమేష్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమల్లు, డీటీ మన్‌మిత్‌సింగ్, ఆర్‌ఐ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ జాగృక్త దివస్

తిమ్మాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అలుగునూర్‌లోని అక్షర పాఠశాలలో బుధవారం సైబర్ జాగృక్త దివస్ నిర్వహించారు. సీఐ సదన్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, ప్రిన్సిపాల్ విజయభారతి, పాల్గొన్నారు.

తల్లి చితికి నిప్పు పెట్టిన బాలుడు

శంకరపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భర్త అనుమానించి వేధించడంతో ఆత్మహత్య చేసుకున్న శ్రావ్య అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. శ్రావ్య కుమారుడు ఐదేళ్ల శ్రేయస్సునందన్ తల్లిచితికి నిప్పు పెట్టే సంఘటన అందరి చేత కంటతడి పెట్టించింది. తల్లిని కోల్పోయిన ఆ బాలుడిని ఎలా ఓదార్చేదని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే గ్రామస్థులు కంటతడి పెట్టారు. ఉపాధి కోసం రెండేళ్ల క్రితం బెహరాన్ వెళ్లిన భర్త ధర్మతేజ్ శ్రావ్య మృతి వార్త తెలుసుకొని వచ్చి కన్నీటి పర్యంతమయ్యాడు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

ఇల్లందకుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశాన్ని పక్కదారి పట్టించి, ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్లు కల్పించడానికి న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ ధర్నా చేస్తోందే తప్ప బీసీల కోసం కాదన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి, ర్యాకం శ్రీనివాస్, నాయకులు శోభన్ బాబు, ఆరెల్లి శ్రీనివాస్, ఎల్లారెడ్డి, రత్నాకర్, రాంబాబు, లింగారెడ్డి, రమేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీనియార్టీతోనే నాన్‌జాయినింగ్ ఖాళీలను భర్తీ చేయాలి

గన్నేరువరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీనియారిటీ జాబితాలలోని అభ్యర్థులతోనే ఉపాధ్యాయ పదోన్నతుల్లోని నాన్‌జాయినింగ్ ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని టీపీయూఎస్‌జిల్లా ప్రధానకార్యదర్శి తిరుపతి రావు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో బుధవారం పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోకుండా ఉపాధ్యాయ ఉద్యోగులను మోసం చేస్తూ కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. టీపీయూఎస్ జిల్లా కార్యదర్శి రాజమౌళి, ప్రధానోపాధ్యాయులు రామయ్య, శారద, కృష్ణమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నియోజకవర్గంలోని 168 మంది లబ్ధిదారులకు 37 లక్షల 86,500 రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బుధవారం క్యాంపు కార్యాయలంలో పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

నీటి ఘర్షణపై డీఈ విచారణ

హుజూరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలంలోని కాట్రపల్లి, దమ్మక్కపేట మధ్య దేవాదుల నీటికోసం జరిగిన ఘర్షణపై బుధవారం డీఈ ప్రశాంతి, ఏఈ అరవింద్, టౌన్‌సీఐ కరుణాకర్ విచారణ చేపట్టారు. రైతులను పిలిచి మాట్లాడారు. సమస్యలుంటే మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. దేవాదుల నీరు చివరి ఆయకట్టు వరకు తప్పకుండా అందిస్తామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

పనిచేయని నిఘానేత్రాలు



ఉల్లంపల్లిలో పనిచేయని సీసీ కెమెరాలు

చిగురుమామిడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పది గ్రామాల్లో పోలీస్ అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సంవత్సరం నుంచి పని చేయడం లేదు. ఆయా గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో దాదాపు 147సీసీ కెమారాలను ఏర్పాటు చేశారు. దాదాపు సంవత్సరం నుంచి వీటి గురించి పట్టించుకున్న

పట్టించుకోని అధికారులు

నాథుడు లేడు. దీంతో ఆయా గ్రామాల్లో పలు సందర్భాల్లో దొంగతనాలు, ఘర్షణలు, రాజకీయ పార్టీల గొడవలు జరిగిన సమయాల్లో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడే అవకాశం ఉన్నది. ఇటీవల మండలంలోని బొమ్మనపల్లిలో వరుసగా మూడు ఇళ్లల్లో ఒకేరోజు చోరీ జరిగింది. ఆ సందర్భంలో సీసీ కెమెరాలు పనిచేసి ఉంటే దొంగలను పట్టుకోవడం సులభంగా ఉండేదని గ్రామస్థులు అంటున్నారు. గ్రామాల్లో జరిగే దొంగతనాలు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా మండలంలోని గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేసే విధంగా చూడాలని మండల ప్రజలు పోలీస్ అధికారులను కోరుతున్నారు.

గ్రామం	సీసీ కెమెరాలు
కొండాపూర్	13
సుందరగిరి	10
నవాబుపేట	14
బొమ్మనపల్లి	28
ఉల్లంపలి	10
రేకొండ	08
రామంచ	12
చిగురుమామిడి	14
చిన్నముల్కనూర్	10
ఇందుర్తి	28

వినియోగంలోకి తెస్తాం

- ఎస్సై సాయికృష్ణ

మండలంలో ఏర్పాట చేసిన సీసీ కెమెరాలు కోతుల దాడుల వల్ల చెడి పోయాయి. వాటిని సక్రమంగా చేసి తిరిగి వినియోగంలోకి తెస్తాం. మండలంలో ఎలాంటి నేరాలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

భయభ్రాంతులకు గురిచేయొద్దు



స్థానికులతో మాట్లాడుతున్న మాజీ మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ 30 మీటర్ల పరిధి పేరిట ప్రజలకు నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేయడం మానుకోవాలని మాజీ మేయర్, బీజేపీ నాయకుడు సునీల్‌రావు అన్నారు. నగరంలోని బతుకమ్మకాలనీ, హస్నాపురం పెద్దమ్మకాలనీ వాసులకు ఎస్సారెస్పీ నోటీసులు ఇచ్చిన సందర్భంగా బుధవారం కాలనీవాసులను పరామర్శించారు. నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లామని, వారు వెంటనే కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. మాజీ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు తదితరులు ఉన్నారు.

వానాకాలం సాగుపై ఆశలు

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుతం ప్రాజెక్టులోకి 50 శాతం నీరు వచ్చి చేరడంతో విడుదలకు రంగం సిద్ధం చేశారు. కాకతీయ కాలువకు నీరు విడుదల చేయడంతో ఆయకట్టు పరిధిలో మిగతా 80 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తికావడమే కాకుండా ఇప్పటికే నాట్లు పూర్తయి ఎండిపోతున్న దశలో ఉన్న పైర్లకు సాగునీరు అంది పంట దక్కించుకునే అవకాశం కలుగుతున్నది. ఒకటి రెండు మంచి వర్షాలు కురిసినా ప్రాజెక్టులు నిండే అవకాశాలు ఉండడంతో వానాకాలం సీజన్‌లో అంచనాల మేరకు సాగు జరిగి ఫలసాయం పొందే అవకాశాలు ఉంటాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

'సీజనల్' వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లందకుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని శ్రీరామ సాయి సేవా ట్రస్టు వృద్ధాశ్రమంలో పీహెచ్‌సీ తరపున మెడికల్ క్యాంపు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటితో దోమలు వృద్ధి చెంది జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్, డాక్టర్ కళ్యాణ్, శ్యామల, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుకు అల్ఫోర్స్ జీనియస్ విద్యార్థిని

హుజూరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్‌స్కూల్లో 7వతరగతి చదువుతున్న తాళ్లపల్లి చైత్ర గిన్నిస్ బుక్ రికార్డు, 4వ తరగతి చదువుతున్న అద్వైతరెడ్డి కరాటేలో గోల్డ్‌మెడల్ సాధించడంపై పాఠశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఏదో ఒక రంగంలో నిష్ణాతులుగా నిలవాలన్నారు.

మౌంట్ ఎల్బ్రస్‌ను అధిరోహించిన ఐవీవై విద్యార్థి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి మాదక ద్రవ్యాలకు వ్యతిరేక నినాదంతో యూరప్‌లోని మౌంట్ ఎల్బ్రస్ శిఖరాన్ని జిల్లా కేంద్రంలోని ఐవీవై పాఠశాల విద్యార్థి లెంకల వివేకానందరెడ్డి అధిరోహించాడు. సీతారాంపూర్‌లోని ఐవీవై పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వివేకానందరెడ్డి తండ్రి మహిపాల్‌రెడ్డి ప్రోత్సాహంతో ఘనత సాధించాడు. డ్రగ్స్‌పై ఇతరులకు అవగాహన కల్పించడానికి శిఖరాన్ని అధిరోహించినట్లు తెలిపాడు. ఈ సందర్భంగా వివేకానందరెడ్డికి బుధవారం ఐవీవై విద్యార్థులు, యాజమాన్యం స్వాగతం పలికారు. పాఠశాల చైర్మన్ పసుల మహేష్ వివేకానందరెడ్డిని సన్మానించారు. డైరెక్టర్ పసుల జయశ్రీ పాల్గొన్నారు.

పారమితలో విద్యార్థుల హౌస్‌ల ప్రారంభోత్సవం

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మంకమ్మతోట పారమిత ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హౌస్‌లను బుధవారం పాఠశాలల అధినేత డాక్టర్ ప్రసాదరావు ప్రారం భించారు. విద్యార్థులను చీతాస్, ఈగల్స్, టైగర్స్, లయన్స్ అనే పేర్లతో గ్రూపులుగా విభజించారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనూకర్‌రావు, టీఎస్‌వీ రమణ, వీయూఎం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సుష్మా స్వరాజ్ వర్ధంతి

భగత్‌నగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 63వ డివిజన్ సుష్మా స్వరాజ్ చౌరస్తాలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం సుష్మా స్వరాజ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు పబ్బల అంజనేయులు, వల్లెం సంజయ్ కుమార్, రాజమల్లయ్య పాల్గొన్నారు.

వన్‌టౌన్ సీఐగా రాంచందర్‌రావు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వన్‌టౌన్ సీఐగా రాంచందర్‌రావు నియామకమయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న సీఐ బిల్ల కోటేశ్వర్ ఐజీ కార్యాలయానికి అటాచ్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ సీఐగా పనిచేస్తున్న రాంచందర్‌రావు ఇక్కడికి బదిలీ అయ్యారు. కమిషనరేట్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వుడ్ విభాగంలో ఎంటీవోగా పనిచేస్తున్న కుమారస్వామిని ట్రాఫిక్ సీఐగా అటాచ్ చేశారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

గంగాధర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని మైత్రిగ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి అన్నారు. గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో ఇటీవల మృతిచెందిన మాజీసర్పంచ్ భర్త తాళ్లరవి కుటుంబాన్ని పరామర్శించారు. ఎన్ని పనులు చేశారు, ఎంతవరకు బిల్లులు రావాల్సి ఉందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్థికసహాయం అందించారు.

ఎరువుల కొరత కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే

గన్నేరువరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులను ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తున్నదని ఇది కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే అని బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నదాతలపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటేకు గోజిర్యూ క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని శివమొగ్గలో ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్న 6వ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గోజిర్యూ కరాటే సంస్థకు చెందిన 14 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు సంస్థ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సురభి వేణుగోపాల్ తెలిపారు. క్రీడాకారులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్, జనార్దన్‌రెడ్డి, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరం

జమ్మికుంట రూరల్/రామడుగు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, డాక్టర్ మౌనిక అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రామడుగు మండలం గుండిగోపాల్‌రావుపేట పీహెచ్‌సీలో అవగాహన కల్పించారు.

వింధ్యావాలీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలీ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థులు బుధవారం బత్కపల్లిలోని పొలాలను సందర్శించారు. పంటల సాగుపై తెలుసుకున్నారు.పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు కిట్స్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ కందుకూరి శంకర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాజీ మేయర్ రవీందర్‌సింగ్ జన్మదిన వేడుకలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ జన్మదిన వేడుకలను బుధవారం మాజీ కార్పొరేటర్ కమల్ జిత్ కౌర్ సోహన్‌సింగ్, సర్దార్ జస్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు వరప్రసాద్ పటేల్, కిరణ్ తివారి, సత్బీర్‌సింగ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి

రామడుగు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అండర్-12 లాంగ్‌జంప్ విభాగంలో గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ విద్యార్థి సత్తాచాటాడు. ఈ సందర్భంగా 6వ తరగతికి చెందిన ఎన్ రిషివర్ధన్ మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి విద్యార్థిని అభినందించారు.

ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్‌కు నివాళి

ఇల్లందకుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గద్దర్‌కు నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాది రాజు, నాయకులు పాల్గొన్నారు.